GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 8 | సంచిక : 04 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 19.07.2025 | పేజీలు : 3



## ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు నక్సల్స్ మృతి

**టి మీడియా, జులై 18,నారాయణపుర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. నారాయణపుర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు నక్సల్స్ మృతి చెందారు. అబుజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో ఛత్తీస్‌గఢ్ పోలీసులు, భద్రత దళాలతో కలిసి యాంటీ నక్సల్స్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే భద్రత దళాలకు మావోయిస్టులు తారసపడగా ఇరువైపుల నుంచి ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో ఆరుగురు నక్సల్స్ మృత దేహాలను భద్రత దళాలు గుర్తించాయి. ఏకే 47, %బూ=% రైఫిల్స్‌తో పాటు మరికొన్ని ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాదీనం చేసుకున్నాయి. నక్సల్స్ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# ప్రాజెక్టులను అడ్డుకోవద్దు




## విజ్ఞప్తులను వినకపోతే పోరాటం
## ఎపికు సీఎం రేవంత్ రెడ్డి అల్టిమేటమ్

**టీ మీడియా, జూలై 18,నాగర్‌కర్నూలు :**తెలంగాణలో అత్యంత కీలకమైన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు డిండి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను అడ్డుకోవద్దని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. సహకరించాలని కోరుతున్నాం. మా విజ్ఞప్తులను వినకపోతే పోరాటం చేసి సాధించుకుంటాం. నాయకత్వం వహించే బాధ్యత నేను తీసుకుంటా.." అని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు పాలమూరును దత్తత తీసుకున్న శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు గారికి ఇప్పుడు రెండు రాష్టాలు సమంగా, తెలుగు వారు అభివృద్ధి సాధించాలన్న ఆలోచనే నిజమైతే రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రద్దు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు.నాగర్‌కర్నూలు జిల్లా కొల్లపూర్, జటప్రోలులో ప్రతిపాదిత యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ముందుగా అక్కడ మదనగోపాల స్వామి వారి ఆలయం చేరుకుని స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన అనంతరం, మంత్రులు దామోదర రాజనర్సింహ , జూపల్లి కృష్ణా రావు గారు, వాకిటి శ్రీహరి , ఎంపీ మల్లు రవి , ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమక్షంలో జరిగిన "ప్రజా పాలన - ప్రగతి బాట" బహిరంగ సభలో ముఖ్యమంత్రిప్రసంగించారు. రాష్ట్రంలోని ప్రతిపాదిత నీటి పారుదల ప్రాజెక్టులు, మహిళాభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాల వంటి అంశాలను రేవంత్ రెడ్డి గారు ప్రధానంగా ప్రస్తావించారు. తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులను అడ్డుకోవద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి విజ్ఞప్తి చేస్తూనే అడ్డుపడితే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.మా ప్రాజెక్టులను అడ్డుకోవద్దు. అక్కడి సూర్యుడి ఇక్కడ పొడిచినా ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. పాలమూరు వలసల జిల్లా కాదు. పరిపాలన అందించే జిల్లాగా నిరూపిస్తాం. చంద్రబాబు నాయుడు గారికి మా విజ్ఞప్తి. వారు బాధ్యతగా వ్యవహరించాలి. సహకరించి ఉదారతను చాటుకోవాలి. పాలమూరు - రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి, భీమా కోయిల్ సాగర్, నెట్టెంపాడు అన్ని సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను ఈ ఏడాది డిసెంబర్ 9 నాటికి పూర్తి చేసి అందరికీ నష్ట పరిహారం చెల్లిస్తాం. రాబోయే రెండేండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పని చేస్తాం. అలాగే, తుమ్మిడిహెట్టి నుంచి వికారాబాద్, తాండూరు, చేవెళ్ల వరకు నీరు తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటాం. అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశంలోనే ఎస్సీ ఉప కులాల వర్గీకరణ పూర్తి చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. ఎస్సీ ఉపకులాలకు నష్టం వాటిల్లకూడదని వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యాక భర్తీ చేయాలన్న ఉద్దేశంతో కొంతకాలం ఆపి ఇప్పుడు పూర్తి చేయబోతున్నాం.ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాల కాలం పూర్తయ్యే లోపు మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. మొత్తంగా లక్ష ఉద్యోగాలను భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా, తెలంగాణ మాడల్ ను ఆవిష్కరిస్తాం. విదేశీ పర్యటనల సందర్భంగా దాదాపు 3 లక్షల కోట్ల మేరకు పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగావకాశాలు కల్పించాం . అధికారం చేపట్టిన 18 నెలల కాలంలో దేశంలో ఏ రాష్ట్రం చేయలేనన్ని సంక్షేమ పథకాలు మహిళలకు అందించాం. మహిళలను చైతన్యవంతులను చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని లక్ష్యంగా నిర్దేశించాం. తెలంగాణ 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని సంకల్పించాం.. వెనుకబడిన ప్రాంతమైన కొల్లాపూర్ అభివృద్ధికి సంబంధించి మంత్రి జూపల్లి గారు విజ్ఞప్తులపై సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ గారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద 344 కోట్ల రూపాయల చెక్కును అందించారు. అలాగే బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా, లోన్ బీమాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. పలువురు లబ్దిదారులకు ఆహార భద్రత (రేషన్ కార్డులు) కార్డులను అందించారు.

## నిందితులను టీఎంసీ కాపాడే ప్రయత్నం

- మమతపై మోదీ విమర్శలు
- ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు


**టి మీడియా, జులై 18,దుర్గాపూర్ :** అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న భారత్ సంకల్పం గురించి ఇప్పుడు ప్రపంచమంతా చర్చ జరుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. దేశంలో కనిపిస్తున్న మార్పులే అందుకు కారణమని, వాటిపైనే అభివృద్ధి చెందిన భారత్ అనే భవనం నిర్మితమవుతుందని చెప్పారు. బంగాల్‌లో ఆయిల్, గ్యాస్, పవర్, రైల్, రోడ్డు రంగాలకు సంబంధించి 5వేల 4వందల కోట్ల వ్యయంతో కూడిన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం దుర్గాపుర్‌లో జరిగిన సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆర్జీ కార్ ఆస్పత్రిలో జరిగిన హత్యాచార ఘటనలో టీఎంసీ ప్రభుత్వం నిందితులను కాపాడే ప్రయత్నం చేసిందని దుయ్యబట్టారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలు గౌరవించబడుతున్నట్లు చెప్పారు. తమకు బెంగాల్ అస్థిత్వమే ముఖ్యమని ప్రధాని మోదీ అన్నారు. దుర్గాపుర్, రఘునాథ్‌పుర్‌లోని ఉక్కు, విద్యుత్ ప్లాంట్లలో కొత్త సాంకేతికత నెలకొల్పాం. అందుకోసం రూ.15వేల కోట్ల పెట్టుబడులు పెట్టాం. ఆ ఫ్యాక్టరీలు ప్రపంచంతో పోటీపడేలా మరింత సమర్థంగా మారాయి. ఈ




ప్రాజెక్టులు పూర్తయినందుకు బంగాల్ ప్రజలను అభినందిస్తున్నాను. పరిశ్రమలు లేదా వ్యవసాయం సహా అన్ని రంగాలు 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలనే సంకల్పంతో పనిచేస్తున్నాయి. అభివృద్ధి నుంచి స్వావలంబన, ఉపాధి నుంచి ఆత్మనిర్భర్‌తా, సున్నితత్వం నుంచి సుపరిపాలన అనే విలువలతో ముందుకు సాగుతూ బంగాల్‌ను దేశాభివృద్ధి యాత్రలో గొప్ప చోదకశక్తిగా మార్చి తీరుతాం.టీఎంసీ పార్టీ బుజ్జగింపు రాజకీయాలు అన్ని హద్దులను దాటివేసింది'మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వంపైనా విరుచుకుపడ్డారు మోదీ. టీఎంసీ పార్టీ బుజ్జగింపు రాజకీయాలు అన్ని హద్దులను దాటివేసిందని ఆరోపించారు. ఇప్పుడు అక్రమణదారులను రక్షించేందుకు ఏకంగా రోడ్ల మీదకు వచ్చి నిరసనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ అవినీతి, బుజ్జగింపు రాజకీయాల వల్ల బంగాల్? యువత నష్టంగా మారిందని అభిప్రాయపడ్డారు. టీఎంసీతో పాటు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు సైతం బంగాల్?ను పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్? పొత్తులో ఉన్న టీఎంసీ, లెఫ్ట్ పార్టీలు బంగ్లాకు శాస్త్రీయ భాష హోదా ఇవ్వలేదని దుయ్యబట్టారు.

## లిక్కర్ స్కామ్‌తో...
# ఫోన్ ట్యాపింగ్ కేసు లింక్

### నిందితులకు అడ్డాగా దుబాయ్



**టీ మీడియా, జూలై 18, హైదరాబాద్ బ్యూరో:** దుబాయ్‌లో ఖరీదైన భవనాన్ని మద్యం కుంభకోణం నిందితులు అడ్డాగా మార్చుకున్నారని సిట్ గుర్తించింది. అక్కడ ప్రైమ్ ఏరియాగా పరిగణించే పారామౌంట్ టవర్ హోటల్ అండ్ రెసిడెన్సీస్‌లో మద్యం ముడుపుల కేసు నిందితులు ఆశ్రయం పొందారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడైన శ్రవణ్‌రావుతో కలిసి మద్యం కేసు నిందితులు ఉన్నట్లు నిరూపించే కొన్ని ఆధారాలను హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త ఆకర్ష్ కృష్ణ గురువారం సిట్ అధికారులకు పంపించారు. వాటిని పరిశీలించిన అధికారులు సమగ్ర సమాచారంతో ఈ నెల 22వ తేదీన సిట్ కార్యాలయానికి రావాలని ఆకర్ష్ కృష్ణను కోరింది.ఫ్లాట్ నంబర్ 5801లో కొన్నాళ్లు ఉన్నట్లు: పారామౌంట్ టవర్ హోటల్ అండ్ రెసిడెన్సీస్ దుబాయ్‌లోని ప్రైమ్ ఏరియాగా పరిగణించే బిజినెస్ బే ఏరియాలో ఉన్న అత్యంత విలాసవంతమైన 66 ఫ్లోర్ల భవనం. అందులో 1 నుంచి 34వ ఫ్లోర్ వరకు ఓ ఫైవ్‌స్టార్ హోటల్ నిర్వహిస్తున్నారు. 35 నుంచి 66వ ఫ్లోర్ వరకు నివాస ఫ్లాట్‌లు ఉంటాయి. రాష్ట్రంలో వేల కోట్ల విలువైన మద్యం స్కామ్?తో భారీ మొత్తంలో కొల్లగొట్టి దుబాయ్‌కి పారిపోయి, అక్కడ పెట్టుబడులు, కంపెనీలు ఏర్పాటు చేసుకున్న వైఎస్సార్సీపీ ముఠా ఈ భవనాన్నే తమ డెన్‌గా చేసుకుంది. ఈ కేసులో నిందితులైన బూనేటి చాణక్య, పురుషోత్తం వరుణ్‌కుమార్‌తో పాటు మరికొంతమంది తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడైన శ్రవణ్‌రావుతో కలిసి ఈ భవనం 58వ అంతస్తులోని ఫ్లాట్ నంబర్ 5801లో కొన్నాళ్లు ఉన్నట్లు తాజాగా సిట్ దృష్టికి వచ్చింది.ఈ ఫ్లాట్ శ్రవణ్‌రావు భార్య స్వాతిరావు, హైదరాబాద్‌కు చెందిన ఆర్. కావ్యల పేరిట ఉంది. కావ్య భర్త ఆకర్ష్ కృష్ణ ఒక వ్యాపారవేత్త. శ్రవణ్‌రావు వారిని మోసగించి ఆ ఫ్లాట్‌ను తన గుప్పిట్లో పెట్టుకున్నారని, అక్కడ మద్యం కుంభకోణం నిందితులకు ఆశ్రయమిచ్చారని సిట్‌కు సమాచారమందింది. శ్రవణ్‌రావుతో కలిసి వారు అదే ఫ్లాట్‌లో ఉన్నారనే ఆధారాలను ఆకర్ష్ కృష్ణ గురువారం సిట్ అధికారులకు పంపించారు. వాటిని పరిశీలించిన సిట్ అధికారులు సమగ్ర సమాచారంతో ఈ నెల 22వ తేదీన సిట్ కార్యాలయానికి రావాలని కోరారు.

### ప్రభుత్వానికి లేఖ రాస్తే మరిన్ని వివరాల

మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు మొదలైన వెంటనే అందులో కీలక పాత్రధారులైన తూతేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, బూనేటి చాణక్య, సైఫ్ అహ్మద్, ముప్పిడి అవినాష్‌రెడ్డి, పురుషోత్తం వరుణ్‌కుమార్, బొల్లారం శివకుమార్, సైమన్ ప్రసన్, ప్రణోయ్ ప్రకాశ్ తదితరులందరినీ వైసీపీ ముఠా దుబాయ్ పంపించేసింది. కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులకు గోల్డెన్ వీసాలు ఇప్పించింది. వారి ప్రధాన స్థావరం పారామౌంట్ హోటల్ అండ్ రెసిడెన్సీస్ భవనమేనని ఇప్పుడు బయటపడింది. శ్రవణ్‌రావు గుప్పిట్లో ఉన్న ఫ్లాట్‌తో పాటు మరికొన్ని ఫ్లాట్‌లను వారు అద్దెకు తీసుకుని ఆ భవనంలో ఉన్నట్లు సిట్‌కు సమాచారం అందింది. దీనిపై యు ఎ ఇ ప్రభుత్వానికి లేఖ రాసి మరిన్ని వివరాలు తెప్పించాలని సిట్ భావిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ఆకర్ష్ కృష్ణ, ఫోన్ ట్యాపింగ్ నిందితుడు శ్రవణ్‌రావు కలిసి 2023లో దుబాయ్‌లోని పారామౌంట్ టవర్ హోటల్‌లో 1,340 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఫ్లాట్ కొన్నారు. ఆకర్ష్ కృష్ణ సతీమణి ఆర్. కావ్య, శ్రవణ్‌రావు భార్య స్వాతిరావుకు చెరిసగం వాటాలతో ఈ ఫ్లాట్ రిజిస్టరైంది. దానిని డీలక్స్ హాలీడే హోమ్స్ సంస్థకు అద్దెకు ఇచ్చారు. అనంతరం శ్రవణ్‌రావు తమను పూర్తిగా పక్కనపెట్టేసి స్వాతిరావు పేరుతో అద్దె ఒప్పందాన్ని చేసుకుని ఫ్లాట్‌ను తమ ఆధీనంలో పెట్టుకున్నారని ఆకర్ష్ కృష్ణ సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అసలు ఆ ఫ్లాట్‌లో ఎవరెవరు ఉంటున్నారని ఆకర్ష్ కృష్ణ వివరాలు సేకరించగా, ఈ సంవత్సరం ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27వ తేదీ వరకూ లిక్కర్ స్కామ్ కేసులో నిందితులైన బూనేటి చాణక్య, వరుణ్ పురుషోత్తంతో పాటు ఆ గ్యాంగ్ లోని మరికొంతమంది ఆ ఫ్లాట్‌లో ఉన్నట్లు వెల్లడైందని ఆకర్ష్ కృష్ణ సిట్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దుబాయ్‌లోని పారామౌంట్ హోటల్ అండ్ రెసిడెన్సీస్ విలాసానికి, రాజభోగాలకు పెట్టింది పేరు. కళ్లు చెదిరిపోయే ఫినిషింగ్‌తో ఉండే ఈ టవర్స్‌లోని ఫ్లాట్‌లు వైభోగానికి చిహ్నాంగా నిలుస్తాయి. రూఫ్‌టాప్ ఇన్‌ఫినిటీ పూల్, సినిమా థియేటర్లు, ఖరీదైన రెస్టారెంట్లు, లగ్జరీ స్పాల వంటి సకల సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఈ టవర్‌లో నివసించాలంటే భారత కరెన్సీలో లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అలాంటి చోట మద్యం కుంభకోణం నిందితులున్నారంటే వారు ఏ స్థాయిలో కొల్లగొట్టారో అర్థం చేసుకోవచ్చు.

# ఇండియా' కూటమిలో చీలిక..?

### -అలయన్స్?కు ఆప్ గుడ్ - కీలక భేటీకి రాలేమని స్పష్టం



**టి మీడియా, జులై 18, ఢిల్లీ:**విపక్ష ఇండియా కూటమికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) దూరమైంది. శనివారం దిల్లీలోని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో జరగనున్న ఇండియా కూటమి ఎంపీల భేటీకి హాజరుకావొద్దని ఆప్ అధిష్టానం నిర్ణయించింది. ఈవిషయాన్ని ఆప్ తరఫున ఎంపీ సంజయ్ సింగ్ కాంగ్రెస్ పెద్దలకు తెలియజేశారు. తమ ఎంపీలను ఆ మీటింగ్‌కు పంపేది లేదని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా 2024 లోక్‌సభ ఎన్నికల కోసమే ఇండియా కూటమి ఏర్పడిందని విలేకరులకు సంజయ్ సింగ్ చెప్పారు. ఈ కూటమి వల్లే విపక్ష పార్టీలకు 240 లోక్‌సభ సీట్లు వచ్చాయని, అది గొప్ప విజయమన్నారు.

### టీఎంసీ ఎంపీలూ గైర్హాజరు

సోమవారం (జులై 21) నుంచి జరగనున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై చర్చించేందుకు ఇండియా కూటమి ఎంపీలు శనివారం భేటీ కానున్నారు. ఇండియా కూటమి చివరిసారిగా లోక్‌సభ ఎన్నికల తర్వాత 2024 సంవత్సరం జూన్ 1న సమావేశమైంది. ఏడాది తర్వాత మళ్లీ ఇప్పుడు జరగబోతున్న భేటీకి ఆప్ దూరమవడం, కూటమిలో ఏర్పడిన చీలికకు నిదర్శనంగా నిలుస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఆప్‌తో పాటు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీలు కూడా జులై 19న జరగనున్న ఇండియా కూటమి భేటీకి గైర్హాజరు కానున్నారు. జులై 21న బంగాల్‌లో నిర్వహించనున్న షహీద్ దివస్ ఉత్సవాల ఏర్పాట్లలో బిజీగా ఉన్నందున సమావేశానికి హాజరుకాలేకపోతున్నామని టీఎంసీ ఎంపీలు సమాచారమిచ్చారు.

### దిల్లీ నుంచి పంజాబ్ దాకా గ్యాపే

ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక పార్లమెంటు సెషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి గతంలో ఇండియా కూటమి పార్టీలు రాసిన ఉమ్మడి లేఖలో ఆప్ భాగం కాలేదు. అయితే ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ వేరుగా ఓ లేఖను ప్రధాని మోదీకి రాశారు. ఆ ఘటనతో విపక్ష ఇండియా కూటమికి దూరంగా ఉండటానికి ఆప్ ప్రాధాన్యత ఇస్తోందని తేటతెల్లమైంది. ప్రస్తుతం ఆప్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం పంజాబ్. ఇటీవలే అక్కడి ఆప్ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. బీజేపీతో కలిసి తమ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులపై కాంగ్రెస్ కేసులు పెట్టించిందని ఆప్ ఆరోపించింది. ఈనేపథ్యంలో ఇండియా కూటమి ఎంపీల భేటీకి ఆప్ దూరం కావడం గమనార్హం. 2027 ఫిబ్రవరిలో జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల వరకు ఆప్ ఇదే విధంగా ఒంటరిగా ముందుకు సాగొచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది దిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆప్, కాంగ్రెస్ వేర్వేరుగా పోటీ చేసిన సంగతి తెలిసిందే.

### నితీశ్ కుమార్‌తో అలా మొదలైంది

2022 సంవత్సరం ద్వితీయార్థం నుంచి విపక్ష ఇండియా కూటమి ఏర్పాటు కోసం క్షేత్రస్థాయిలో కసరత్తు చేసిన ముఖ్య నేతల జాబితాలో బిహార్ సీఎం నితీశ్ కుమార్ (జేడీయూ అధినేత) కూడా ఉన్నారు. ఈక్రమంలో అప్పట్లో ఆయన ఆప్ అధినేత, నాటి దిల్లీ సీఎం కేజ్రీవాల్‌తోనూ భేటీ అయ్యారు. విపక్ష కూటమిలో చేరాలని కోరారు. ఈ ప్రయత్నాల ఫలితంగా 2023 జూన్ 23న 26 రాజకీయ పార్టీలు కలిసి ఇండియా కూటమిని ఏర్పాటు చేశాయి. లోక్‌సభ ఎన్నికలకు సరిగ్గా మూడు నెలల ముందు, 2024 జనవరి 28న ఎన్‌డీఏ కూటమిలోకి నితీశ్ జంప్ అయ్యారు. దీంతో ఇండియా కూటమి సారథ్య బాధ్యతలను కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మరిన్ని పార్టీలు విపక్ష కూటమిని వీడాయి. ఇప్పుడు ఆమ్ ఆద్మీపార్టీ కూడా ఇండియా కూటమికి దూరమైంది. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ రాజకీయంగా ఒంటరిగా ముందుకు సాగడానికే ప్రాధాన్యత ఇస్తుండటం గమనార్హం.

## ఆధార్ అపడేషన్ కోసం ప్రత్యేక క్యాంపు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...**



**టీ మీడియా,జూలై 18, పెద్దపల్లి-బ్యూరో :** ఆగస్టు 5 నుంచి 8 వరకు కలెక్టరేట్ లో ఆధార్ అపడేషన్ కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఆధార్ కార్డు పొందేందుకు మీసేవ ద్వారా అడ్రస్ తో జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్,తల్లి లేదా తండ్రి అప్ డేట్ చేసిన ఆధార్ కార్డు ఉండాలని అన్నారు. ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు కోసం ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా నివాస సర్టిఫికెట్, బ్యాంకు పుస్తకం/ పోస్టల్ బుక్ తో సహా అటెస్టడ్ దరఖాస్తు ఫారం ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఆధార్ కార్డులు పేరు స్పెల్లింగ్ పొరపాట్ల సవరణకు ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా ప్యాన్ కార్డు లేదా ఎస్.ఎస్.సి మార్కుల మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేదా మైనర్ ఐతే బర్త్ సర్టిఫికెట్ ఉండాలని, పెళ్లి తర్వాత పేరు మార్పు కోసం సబ్ రిజిస్టర్ జారీ చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్, పెళ్లి ఫోటో,ఇతర గుర్తింపు కార్డులు ఉండాలని,పూర్తిగా పేరు మార్పు కోసం గెజిటెడ్ చేసి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆధార్ కార్డు లో డేట్ అఫ్ బర్త్ కరెక్షన్ కోసం బర్త్ సర్టిఫికెట్,21 సంవత్సరాల పైబడిన వారికి ఫోటో తో కూడిన మార్కుల మెమో లేదా ఇండియన్ పాస్పోర్ట్ ఉండాలని అన్నారు. ఆధార్ కార్డు బయోమెట్రిక్ అప్డేట్ కోసం బయట 100 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని,ప్రస్తుతం ఈ క్యాంపులో అవసరం లేదని అన్నారు. ఆధార్ అప్డేషన్ అవసరం ఉన్నవాళ్లు ఈ 15 రోజుల వ్యవధిలో కావలసిన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్లో ఏర్పాటుచేసే ఆధార్ అప్డేట్ క్యాంపు ను అవసరమైన ప్రజలు, ఉద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అగ్రగామిగా నిలిచేలా అభివృద్ధి .

**-శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్.**



**టీ మీడియా,జులై 18,గోదావరిఖని** :విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో రామగుండం నగర అగ్రగామిగా నిలిచేలా అభివృద్ధి చేస్తున్నామని స్థానిక శాసన సభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సప్తగిరి కాలనీలో మహాత్మ జ్యోతి బా పూలే పాటశాల ఆవరణలో నిర్వహించిన "వన మహోత్సవ' కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో స్వచ్ఛదనం, పచ్చదనంతో పాటు విశాలమైన రహదారులతో, సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రామగుండం నగరంలో మునిసిపల్ తో పాటు ప్రభుత్వ రంగ సంస్థలైన సింగరేణి, ఎన్టిపిసి సహకారంతో సుమారు పది లక్షల మొక్కలు నాటి,అడవిని తలపించేలా పెంచి పోషించాలని లక్ష్యగా పెట్టుకున్నట్లు తెలిపారు.

ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి చంటి బిడ్డల్లాగా సాకాలని అన్నారు. అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణా నగర్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రూ 2 .00 కోట్లతో కృష్ణా నగర్ కు కూడా ఉపయోగపడే శాలపల్లి రోడ్డు పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుత రెండు కోట్లతో కృష్ణా నగర్ లోనే అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో మూడు కోట్లతో కృష్ణా నగర్ లోనే డ్రైనేజి నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నామని వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి,మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రామగుండం నగరానికి అనేక ప్రాజెక్టులు మంజూరు చేయించామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి,నగర పాలక సంస్థ ఎస్ ఇ శివానంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్,డిఇ షాబాజ్,ఎఇ తేజస్విని,సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్,మెప్మా టి ఎం సి మౌనిక,మహాత్మా జ్యోతిబా పూలే పాటశాల ప్రిన్సిపాల్ రజనీ,తాజామాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి,బొంతల రాజేష్,ముస్తఫా,బాలరాజ్ కుమార్,నాయకులు పాతపెల్లి ఎల్లయ్య,వెగోళపు శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## డ్రై డే ఫ్రై డే,వైద్య పరీక్షలు.

**- డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకటస్వామి**



**టీ మీడియా,జూలై 18, గోదావరిఖని** :వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు అన్ని డివిజన్ లలో డ్రై డే ఫ్రై డే,రామ్మందిర్ రోడ్డులో ప్రజా మరుగు దొడ్డి శుభ్రం చేయించడం,మునిసిపల్ సిబ్బందికి అడ్డగుంటపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకటస్వామి పర్యవేక్షించగా సానిటరీ ఇన్స్పెక్టర్లు కిరణ్,నాగ భూషణం,కుమార స్వామి, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్,ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్,మెప్మా టిఎంసి మౌనిక,సిఓ లు శ్వేత,ఊర్మిళ,ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

## చెట్లను తొలగించిన వజ్రాల రమేష్



**టీ మీడియా, జులై 18, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలోని 24వ వార్డులో ఎలక్ట్రిషన్ డిపార్ట్మెంట్ వాళ్ళు చెట్లు కొట్టించి చేతులు దులుపు కున్నారు. చెట్లు అలాగే రోడ్డుపైన ఉండడం వలన ప్రజలకు ఇబ్బంది కరంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న 24వ వార్డు ప్రజా సేవకులు వజ్రాల రమేష్ విషయము కమిషనర్ కి చెప్పడం జరిగింది. చెప్పిన వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందిని పంపించి చెట్లను తీపియడం జరిగింది. అందుకు సహకరించిన మున్సిపల్ కమిషనర్, ఎస్సై ఉమా మహేశ్వర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.



## మాజీ మంత్రి ని మరచి పోవద్దు

**-సింహ చలం జగన్**

**టీ మీడియా జులై 17,ఎండపల్లి :** వచ్చే ఎన్నికల్లో భారాస పార్టీ తన సత్తాను చాటాలి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్. భారస పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎండపల్లి మండలాన్ని ఏర్పరచడమే కాకుండా గ్రామ అభివృద్ధి పనులు చేపట్టారని సంక్షేమ పథకాలు కూడా ఇంటింటికి అందించారని,తను చేసిన అభివృద్ధి పనులుగుర్తు చేసుకుంటూ మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే స్థానిక ఎన్నికల్లో భారా స పార్టీ తన సత్తాను చాటాలని మండల జెడ్పిటిసి,ఎంపీపీ,ఎంపీటీసీలు అన్ని కైవసం చేసుకునే విధంగా బారసా నాయకులు కార్యకర్తలు పట్టుదలతో ముందుకెళ్ళి విజయం సాధించేవిధంగా కష్టపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల భారాస అధ్యక్షులు సింహాచలం జగన్, మాజీ ఎఎంసి చేర్మన్ ఏలేటి కృష్ణారెడ్డి,మాజీ సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేషం,మెరుగు జానీ, చుంచుమల్లేషం,పడిదం నారాయణ, పడిదంవెంకటేష్,చందు, ఉప్పు రాజయ్య, లచ్చయ్య,మాజీ ఉపసర్పంచ్ మైలారపు సతీష్, మారం జగన్మోహన్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

# జనం కోసం 'జనతా గ్యారేజ్'



## అనిల్‌పై కాల్పులకు అదే కారణం!

**టీ మీడియా, జూలై 18,మెదక్ :** మెదక్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ యువ నేత అనిల్‌కుమార్ హత్య కేసులో పోలీసులు తమ దర్యాప్తును వేగవంతం చేశారు. నిందితులను గుర్తించేందుకు మరో 4 బృందాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో భూ లావాదేవీల కారణంగానే అనిల్?పై కాల్పులు జరిపినట్లు భావిస్తున్న పోలీసులు, ఈ మేరకు సైబరాబాద్ పోలీసుల సహకారం తీసుకుంటున్నారని తెలుస్తోంది. అయితే భూ వివాదాల సమస్యలను పరిష్కరించేందుకు అనిల్ మరికొందరితో కలిసి 'జనతా గ్యారేజ్' ఏర్పాటు చేసినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. ఏపీకి చెందిన ఓ ఎమ్మెల్యే సమీప బంధువుతో అనిల్‌కు ఏర్పడిన వివాదమే కాల్పులకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన రౌడీ షీటర్ల ప్రమేయం ఉందని నిర్ధారిస్తున్నారు.

### నుంచి సొంతూరికి వస్తుండగా

మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతరకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు మరెల్లి అనిల్ (28) ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. సోమవారం (జులై 14) హైదరాబాద్ గాంధీభవన్ నుంచి సొంతూరికి తన కారులో వస్తుండగా వరిగుంతం సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీనిని గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్ ప్రాణాలు విడిచారు. దీంతో పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

### సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా

కుల్చారం ఎస్సై గౌస్ మంగళవారం ఉదయం ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఘటనా స్థలంలో నాలుగు బుల్లెట్లు లభించాయి. దీంతో అనిల్ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని ముందు భావించినా, బుల్లెట్లు లభించడంతో హత్య దిశగా దర్యాప్తు ప్రారంభించారు. అనిల్ కుడి భుజం నుంచి 2 బుల్లెట్లు దూసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. చనిపోయే ముందు అనిల్ తన చేతిపై ఓ ఫోన్ నంబర్ రాసినట్లు తెలిపారు. అయితే అనిల్?పై ఎవరు కాల్పులు జరిపారు? ఎందుకు జరిపారు? హత్యనా? లేక ఆత్మహత్యనా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

### భారీ ఎత్తున దళిత సంఘాలు

అనిల్ మృతి విషయం తెలుసుకున్న దళిత సంఘాలు, గ్రామస్థులు భారీ ఎత్తున మెదక్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రి వద్ద కొద్దిసేపు ఆందోళన నెలకొంది. సమగ్ర విచారణ జరిపి, త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని పోలీసులు చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. శవపరీక్ష కోసం మృతదేహాన్ని మెదక్ మార్చురీలో భద్రపరిచారు.

### 'జనతా గ్యారేజ్' ఏర్పాటు

అనిల్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో విభేదాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని ఓ 6 గుంటల భూమి విషయంలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థతో వివాదం ఉందని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీనికోసం పోలీసులు మరో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. చివరికి హైదరాబాద్‌లోని భూ లావాదేవీల కారణంగానే ఘటన జరిగిందని నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ పోలీసుల సహకారం తీసుకుంటున్నారని సమాచారం. భూ వివాదాలను పరిష్కరించేందుకు అనిల్‌తో పాటు మరికొందరు కలిసి 'జనతా గ్యారేజ్'ను ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

**సుపారీ ఇచ్చి కాల్పులు జరిపించినట్లు :** పొరుగు రాష్ట్రానికి చెందిన ఓ ఎమ్మెల్యే సమీప బంధువుతో అనిల్‌కు ఓ వివాదం ఏర్పడింది. ఈ కారణం వల్లే కాల్పులు జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. 13 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆ ఎమ్మెల్యే బంధువే సుపారీ ఇచ్చి కాల్పులు జరిపించినట్లు ప్రాథమికంగా తేలినట్లు సమాచారం. కాల్పుల్లో హైదరాబాద్?కు చెందిన రౌడీషీటర్ల హస్తం ఉన్నట్లు నిర్ధారిస్తున్నారు. గాంధీ భవన్‌లో సమావేశం ముగించుకుని, అనిల్ తన అనుచరులతో కలిసి ప్రయాణిస్తుండగా నిందితులు రెండు వాహనాల్లో వెంబడించినట్లు సీసీ ఫుటేజీల ద్వారా తెలుస్తోంది. దీని ఆధారంగానే పోలీసులు విచారణ చేపట్టారు

## సమస్యలు పరిష్కరించాలి

**- దాడుల నియంత్రణకై కమిటీని**

**జిల్లా కలెక్టరు కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి**



**టీ మీడియా, జూలై 18, వరంగల్ బ్యూరో:** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి .వి. రాజు గౌడ్, అంతడపుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కు టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రంఅందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్ దృష్టికి వర్కింగ్ జర్నలిస్టులు వృత్తిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యలు, హక్కులను ప్రభుత్వ దృష్టికి, ముఖ్యంగా జిల్లా కలెక్టర్ స్థాయిలో పరిష్కరించాలని కోరారు. 20 ఏళ్ళు గా జర్నలిస్టులకు నివేషణ స్థలాలు ఇవ్వలేదని కేవలం రెండు జర్నలిస్టు సొసైటీలకు ప్రభుత్వం భూమి కేటాయించిందని అది కూడా అన్యాక్రాంతం అవుతుందని దాన్ని కాపాడాలని కలెక్టర్ని కోరారు. జర్నలిస్టులపై దాడుల నియంత్రణకై జిల్లా స్థాయి కమిటీని నియమించాలి. స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వం గతంలో రెండు సొసైటీలకు కేటాయించిన భూమిని అన్యక్రాంతం కాకుండా ఆర్డీవోలతో సమావేశం ఏర్పాటుచేసి కాపాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ హనుమకొండ జిల్లా కోశాధికారి ఈసంపెల్లి రమేష్, సంయుక్త కార్యదర్శి ఈర్ల తిలక్, పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షులు గిరెడ్డి అనిల్ రెడ్డి, కార్యదర్శి దామెర వెంకటేష్, సంపత్ రెడ్డి, అంకేశ్వరపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి గోడ మీద పడి ఇద్దరు కూలీలు మృతి



**టీ మీడియా, జూలై 18,కోటపల్లి :** ఇంటి గోడ మీద పడటంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బావనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కోటపల్లి : ఇంటి గోడ మీద పడటంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా కోటపల్లి ( మండలం బావనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు ఇందిరమ్మ ఇల్లు (మంజూరు కాగా పాత ఇంటిని కూల్చేవేసేందుకు కోటపల్లి మండలకేంద్రానికి చెందిన కూలీలు పని చేస్తున్నారు. శుక్రవారం ఇంటి కూల్చివేత పనులు చేస్తుండగా ఆ ఇంటి గోడ ఒక్కసారిగా రెడ్డి మధునయ్య, శేగం తిరుపతిల పైన పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే 108 అంబులెన్స్ లో చెన్నూర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కూలీ పనులకు వెళ్లి ఇద్దరు మృతి చెందటంతో కోటపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. సంఘటన స్థలాన్ని కోటపల్లి ఎస్సై రాజేందర్ సందర్శించి వివరాలు సేకరించారు.



## విస్తరణ పనులు వేగవంతం చేయాలి

**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**టీ మీడియా, జూలై 18,భద్రాచలం:** శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న మాడవీధుల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు స్పష్టం చేశారు. శుక్రవారం భద్రాచల పర్యటనలో భాగంగా మంత్రి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాడవీధుల అభివృద్ధి ప్రణాళిక, ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరంమంత్రి మాట్లాడుతూ, భద్రాచల రామాలయం రాష్ట్రానికి ఆధ్యాత్మికంగా అత్యంత ప్రాధాన్యమున్న స్థలం. ఇక్కడికి వేలాదిగా భక్తులు వస్తారు. వారి కోసం చేపడుతున్న మాడవీధుల విస్తరణను ఏ మాత్రం ఆలస్యం చేయకూడదు. పనులు వేగవంతంగా పూర్తి చెయ్యాలి అని అన్నారు. మాడవీధుల విస్తరణలో భాగంగా పరిహారం ఇచ్చిన ఇండ్లను తక్షణమే తొలగించాలని, ప్రజలతో సంప్రదించి శాంతియుతంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీనితో పాటు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఈ ప్రణాళిక భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలకు మార్గదర్శకంగా ఉండేలా రూపొందించాలన్నారు. మంత్రి పర్యటనలో జిల్లా అధికారులు, పంచాయతీ సిబ్బంది, ఆలయ ప్రతినిధులు, వివిధ శాఖల ఇంజినీర్లు పాల్గొన్నారు.

## మహిళలు నిలదొక్కుకునేలా చేయూత

**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**టీ మీడియా, జూలై 18,ఖమ్మం:** రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా నిలద్రొక్కుకునేలా ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి, శుక్రవారం స్థానిక వెలుగుమట్ల అర్బన్ పార్క్ లో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో చేపడుతున్న అన్ని పథకాలు మహిళల పేరునే అని, ఏ పథకమైన మహాలక్ష్ముల చేతుల్లోనే అని అన్నారు. మహిళలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, మొదటి సంవత్సరం 21 వేల కోట్లు అందించామని, రెండో సంవత్సరం ఇప్పటికే 6 వేల కోట్లు మహిళలకు అందించినట్లు తెలిపారు. మహిళల రుణాల రికవరీ 99 శాతం, కొన్నిచోట్ల 100 శాతం ఉందన్నారు. జిల్లాలో 2 లక్షల మంది మహిళలు ఉంటే, స్వయం సహాయక సంఘాల్లో 40 వేల మంది మాత్రమే సభ్యులున్నారని, సంఘాల్లో నమోదు కాని వారందరూ వెంటనే నమోదు అవ్వాలని అన్నారు. రాష్ట్రంలో 22 వేల 5 వందల కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసుకున్నామని, అర్హులకు ముందుగా మొదటి విడతలో అందజేస్తామన్నారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లు మొదటి విడతలో వచ్చినట్లు, గుడిసెల్లో ఉంటున్న వారికి ప్రాధాన్యత ఇచ్చి అందజేస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, లోన్లు, ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని ఆపే ప్రసక్తే లేదని, ఈ కార్యక్రమాలు నిరంతర ప్రక్రియ అని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. నగర పరిధిలో 500 ఎకరాల ప్రభుత్వ స్థలం తో వెలుగుమట్ల అర్బన్ పార్క్ జిల్లాకు ఒక మంచి ఆస్తి అని అన్నారు. భవిష్యత్తులో ఇంకా అభివృద్ధి చేసి, ప్రజలు ఒక గంట పార్క్ కు వచ్చి, వాకింగ్ చేస్తే, అన్ని బాధలు మర్చిపోయి, ఆహ్లాదంగా గడిపేలా చర్యలు చేపడతామన్నారు. ఫెన్సింగ్ చేసి, జంతువుల తెచ్చి, పిల్లల ఆట వస్తువుల ఏర్పాటు, ఒకదాని వెంట ఒకటి అన్ని సౌకర్యాలు కల్పించి భవిష్యత్తులో బ్రహ్మాండమైన పార్క్ గా, హైదరాబాద్ లోని నెహ్రూ జులాజికల్ పార్క్ కు ప్రజలు వచ్చినట్లు, అర్బన్ పార్క్ ను తీర్చిదిద్దుతామన్నారు. ఖిల్లా రోప్ వే పనులు చేపట్టి, టూరిజం, మునిసిపల్ శాఖల సహకారంతో అభివృద్ధి చేస్తామని, ఖమ్మం ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా జీవించేలా పరిస్థితులు సృష్టిస్తామని అన్నారు. ఖమ్మం పచ్చగా, పరిశుభ్రంగా, ఆనందంగా ఉండేలా అన్ని చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ,లి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం సహకారం అందిస్తున్నదని తెలిపారు.

ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా స్వయం సహాయక సంఘాలచే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ కొట్టించి, వారికి 5.6 కోట్ల రూపాయలు, వడ్డీ లేని రుణాలు అందించి, అంచెలంచెలుగా మహిళల ఆర్థిక అభివృద్ధి కి చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో 9 వేల పైచిలుకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో ఉండి, రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉన్నామని, ఖమ్మం నియోజకవర్గ పరిధిలో 2700 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారిగా ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామన్నారు. ప్రమాద భీమా, లోన్ భీమా, జిల్లాలో 20 వేల కొత్త రేషన్ కార్డులు, 60 వేల కొత్త సభ్యుల చేర్పు, ఒక్కో సభ్యునికి 6 కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఖమ్మం నియోజకవర్గ పరిధిలో 3వేల నూతన రేషన్ కార్డుల జారీ జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రఘునాథపాలెం మండలానికి సంబంధించి 934 సంఘాలలోని 9340 మంది సభ్యులకు 1.18 కోట్లు, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 2958 సంఘాలలోని 29580 మంది సభ్యులకు 2.81 కోట్లు, ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 3.99 కోట్ల వడ్డీ లేని రుణాలు, మరణించిన 15 మంది సభ్యులకు రూ. 11.76 లక్షలు లోన్ భీమా మంజూరు చేసి, సంబంధిత సంఘాలకు చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, నగర డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, డిఎం సివిల్ సప్లయీస్ శ్రీలత, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ రావూరి కరుణ, కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## లోకేశ్‌ను కలిస్తే తప్పేంటి..?

**-సీఎం రేవంత్‌ను ప్రశ్నించిన కేటీఆర్**




**టీ మీడియా, జూలై 18,ఖమ్మం :** ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కలవలేదు.. కానీ కలిస్తే తప్పేంటి..? అని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. నీకేం నొచ్చిందని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. ఖమ్మం జిల్లాలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నేను అర్ధరాత్రి పోయి లోకేశ్‌ను కలిసానట. మేం ఏం జేసిన బాజాప్తా చేస్తాం. బేజాప్తా చేయాల్సిన కర్మ మాకు లేదు. అయినా నాకు తెల్వక అడుగుతా.. లోకేశ్ నీలాగా ఏమైనా అంతర్ రాష్ట్ర దొంగనా..? లోకేశ్ నీలాగా ఏమైనా సంచులు మోసినోడా..? లోకేశ్ నీలాగా ఏమైనా చదువు రానోడా..? కలవలేదు కానీ కలిస్తే తప్పేంది..? అని రేవంత్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. పక్క రాష్ట్ర మంత్రి, యువకుడు. నాతో డెఫినెట్‌గా సత్సంబంధాలు ఉన్నాయి. మేం ఇద్దరం కూడా ఫ్రెండ్లీగా ఉంటాం. కలవలేదు కానీ కలిస్తే తప్పేంది..? అయినా ఆయన మీ పెద్ద బాస్ చంద్రబాబు కొడుకే కదా..? నేనోదో గూండాను.. దావూద్ ఇబ్రహీమ్‌ను చీకట్లో కలిసినట్లు ఆ డైలాగులు ఏందిరా హౌలా..? నేను అడిగింది ఏంది..? నేను చెప్పింది ఏంది? నేను ఏమైనా నీలాగా దొంగను కలిశానా..? నీలాగా నేను లోఫర్ రాజకీయాలు చేస్తున్నానా ఢిల్లీలో. చీకట్లో పోయి అమిత్ షా కాళ్లు పట్టుకుని, మోదీగారి పాదాలకు ప్రణమిల్లి చిల్లర రాజకీయం చేస్తున్నానా..? పక్క రాష్ట్రం మంత్రి యువకుడు నాకు తమ్ముడి లాంటోడు కలిస్తే కలుస్తా.. కానీ కలవలేదు. దానికేదో ఆయన గొప్ప విషయం కనిపెట్టినట్టు. పాలన గురించి తెలుసుకోవాలంటే మమ్మల్నే బీఆర్ఎసోళ్లను కలుస్తారు. దోపిడీ గురించి తెలుసుకోవాలంటే నిన్ను కలుస్తారు. ఆయన నన్ను కలిస్తే నీకేం నొచ్చింది. నీకేం బాధ అయితుంది. ఈ చిల్లర మాటలతోని ఎన్నిరోజులు టైం పాస్ చేస్తవ్. ఎన్ని రోజులు ప్రజలను ఆగం చేసే ప్రయత్నం చేస్తవ్ అని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు చెరిగారు.